క్లుప్తంగా

నేడు అన్నదాన వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతలమామిడి వద్ద ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద బుధవారం అన్నదాన వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద 13 ఏళ్లుగా అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ప్రతివారం 500 మందికి పైగా భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

6న వీపీబీ శాస్త్రి ట్రస్టు భూముల కౌలు వేలం

గోకవరం: స్థానిక వీపీబీ శాస్త్రి ట్రస్టు భూములకు జూలై 6వ తేదీన కౌలు వేలం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుగుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 10/1, 245, 249, 236లో ఉన్న సుమారు 10 ఎకరాల భూమిని ఈ ఏడాది జూలై ఒకటి నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకూ సాగు చేసుకునేందుకు జూలై 6న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న ధరావత్తు సొమ్ము రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఈ వేలానికి సంబంధించిన నియమ నిబంధనలు గ్రామ పంచాయతీ, తహసీల్దార్, మండల పరిషత్, పోలీసు, గోకవరం పీఏసీఎస్ సొసైటీ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో ప్రచురిస్తారన్నారు.

విద్యార్థులకు సత్కారం



గాడాల హైస్కూల్లో విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలం గాడాల హైస్కూల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం సత్కరించారు. హెచ్ఎం నిర్మలాజ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జి.శ్రావ్యకు (ప్రథమ)రూ.3 వేలు, జి.త్రిపుర సుందరికి (ద్వితీయ) రూ.2 వేలు, ఎస్.శివాని (తృతీయ)కి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహం అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, బాసా సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ కర్రి నాగలక్ష్మి పాల్గొన్నారు.

క్రమశిక్షణ విషయంలో బాధ్యతగా మెలగాలి

రంగంపేట: విద్యార్థుల క్రమశిక్షణ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా మెలగాలని మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.60 లక్షల నిధులతో పాఠశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన వివరించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి మాట్లాడుతూ స్థిరాస్తుల కంటే విద్యే అసలైన ఆస్తి అని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని పాఠశాల కమిటీ అధ్యక్షుడు కేతా రాందాసు అన్నారు. కార్యక్రమంలో కోట నారాయణరావు, పోల్నాటి రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు: ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాల వద్ద తల్లిదండ్రులు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బండారు శివ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిజమైన రైతు బంధువు కాటన్ దొర

బిక్కవోలు: నిజమైన రైతు బంధువు కాటన్ దొరని విఘ్నేశ్వర ఎత్తిపోతల పథకం కార్యనిర్వాహక అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మంగళవారం ఇల్లపల్లిలోని ఎత్తిపోతల కార్యాలయం వద్ద 30వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 20 ఏళ్లుగా ఎత్తిపోతల పథకం పంప్ ఆపరేటర్‌గా సేవలందిస్తున్న చీకట్ల సూరిబాబును సత్కరించారు. కార్యక్రమలో డైరెక్టర్లు సాధనాల రాంబాబు, భీమరాజు, పోలినాటి సూర్యప్రకాష్, అంసూరి సుబ్బారావు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడు పట్టెం కిషోర్‌కు కోర్టు రిమాండ్ విధించిందని ఏఎస్సై సమర్పణరావు మంగళవారం తెలిపారు. ఈనెల 18న పురుషోత్తపట్నంలోని ఓలేటి విజయలక్ష్మి ఇంటిలో ఎనిమిది కాసుల బంగారు ఆభరణాల దొంగతనం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బుట్టాయిగూడెం మండలం బొట్టప్పగూడేనికి చెందిన కిషోర్ పోలవరం ప్రాజెక్ట్ మెగా కంపెనీకి చెందిన ప్రైవేటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం విజయలక్ష్మి లేని సమయంలో దొంగతనం చేశాడన్నారు. కోరుకొండ సీఐ ఉమమహేశ్వరరావు సూచనల మేరకు చినకొండేపూడిలో కిషోర్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు.

పశు బీమా.. పాడి రైతుకు ధీమా

- వైఎస్సార్ పశు బీమా పథకంతో సర్కారు భరోసా
- పశు పోషకులకు ప్రీమియం చెల్లింపులోనూ రాయితీ



అనపర్తి: ప్రకృతి వైపరీత్యాలు, నీటి కాలుష్యం, పాము కాటు, అడవి జంతువుల దాడి, వివిధ ప్రమాదాలు, వాతావరణ మార్పులు తదితర కారణాలతో పశువులు మరణిస్తుంటాయి. జీవాలు మృత్యువాత పడితే వాటిపైనే ఆధారపడిన పెంపకందారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితులు ఏర్పడినపుడు పాడి రైతుకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటాల్లో కూడా ప్రభుత్వం రాయితీ కలిపించి పథకాన్ని అమలు చేస్తోంది. గ్రామాల్లో పశుపోషణే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న అనేకమందికి పాడి రైతులు ఈ పథకంతో ఎంతో మేలు జరుగుతుందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

20 శాతం ప్రీమియం

వైఎస్సార్ పశు బీమా పథకానికి గాను తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, రైతులతో పాటు దారిద్రరేఖకు దిగువన ఉన్న(బీపీఎల్) రైతులు తమ వాటాగా 20 శాతం, మిగిలిన వారు 50 శాతం ప్రీమియంగా చెల్లించాలి. సంకర జాతి పశువులకు మూడేళ్ల కాలానికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వర్గాల వారు తమ వాటా కింద ఒక్కో పశువుకు రూ.384, మిగిలిన వారు రూ.960 బీమా ప్రీమియంగా చెల్లించాలి. దేశవాళి పశువులకు తెల్లరేషన్ కార్డుదారులు రూ.192, మిగిలిన వారు రూ.480 ప్రీమియంగా చెల్లించాలి. అదేవిధంగా గొర్రెలు, మేకలు, పందులకు గాను బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ, పేద వార్గల వారు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వర్గాలకు చెందిన రైతులు ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187.50 చెల్లించాలి.

పశువుల రకాన్ని బట్టి సాయం

వైఎస్సార్ పశు బీమా పథకం కింద పశు పోషకులు గరిష్టంగా ఐదు గేదెలు, 50 గొర్రెలు, లేదా మేకలు, లేదా పందులకు బీమా చేయించుకునే అవకాశముంది. సంకరజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కోదానికి రూ.30 వేలు, అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మృత్యువాత పడితే రూ.15 వేలు చొప్పున పరిహారం అందుతుంది. గొర్రెలు, మేకలు మరణిస్తే ఒక్కోదానికి రూ.6 వేల వరకు పరిహారం ఇస్తారు. బీమా చేయించిన పశువులు, జీవాలు మరణిస్తే వెంటనే సమీపంలో రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకునికి విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. లేదా 1962 కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

అనపర్తి నియోజకవర్గంలో జీవాల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	మేకలు	గొర్రెలు	పందులు
అనపర్తి	1,256	8,644	621	2,954	361
రంగంపేట	7,623	11,045	3,269	3,123	62
బిక్కవోలు	1,203	5,798	1,996	12,174	234
పెదపూడి	2,160	10,445	542	29	179

పశు బీమాపై విస్తృత అవగాహన



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పాడి రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వారిని చైతన్య పరుస్తున్నాం. ఆసక్తి ఉన్న పాడి రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రం, గ్రామాల్లో పశువైద్య అధికారులను సంప్రదించి మూగ జీవాలకు బీమా చేయించుకోవాలి.

– వై.శ్రీనివాసరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ, అనపర్తి

పాడి రైతులకు ఊరట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పాడి రైతులకు అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ పశు బీమా పథకం కింద ప్రభుత్వం అన్ని రకాల పశువులు, గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేయించుకునే అవకాశం కల్పించింది. తక్కువ ప్రీమియంతో పథకాన్ని అందించడం సంతోషంగా ఉంది.

– తేతలి కొండారెడ్డి, పాడి రైతు, అనపర్తి

ఈ-స్టాంప్ కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావు

రాజానగరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ – స్టాంప్ కౌంటర్‌ను సబ్ రిజిస్ట్రార్ ఎస్‌వీఎస్ వీరభద్రరావు మంగళవారం ప్రారంభించారు. కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కౌంటర్ ద్వారా ఆన్‌లైన్ నాన్ జ్యుడిషియల్ ఈ–స్టాంపులు పొందవచ్చు. ఆస్తుల కొనుగోలు, విక్రయాలు మున్నగు లావాదేవీలను పూర్తి చేయడానికి చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేయవచ్చు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్లు ఆదిత్య, రాజేష్, కామన్ సెంటర్ నిర్వాహకుడు నాగవరపు సత్తిబాబు పాల్గొన్నారు.

సీహెచ్‌వోగా వెంకటరత్నం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వోగా పి.వెంకటరత్నం మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన పెదపల్ల పీహెచ్‌సీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో సీతానగరం పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పని చేశారు. ఇప్పటి వరకూ పనిచేసిన పి.రాధాకృష్ణ బదిలీ అయ్యారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించాలి

పెదపూడి: జగనన్న సురక్ష పథకంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఆయన రామేశ్వరం, ఏపీ త్రయం గ్రామాల్లో మంగళవారం అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాష్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తుందన్నారు. సచివాలయాల నుంచి మంజూరయ్యే 11 ధ్రువపత్రాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు, సచివాలయ కార్యదర్శులు అచ్చిరాజు, బాలాత్రిపురసుందరి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు అన్నారు. ఆయన మంగళవారం వంగలపూడిలో సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, పార్టీ నాయకులు కొంచ భాస్కరరావు, చల్లమళ్ల సుజీరాజు, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత తదితరులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో తిర్నాతి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సచివాలయ సిబ్బంది. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



రామేశ్వరంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ సుభాష్

పటిష్టంగా నిర్వహించాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పటిష్టంగా నిర్వహించాలని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం, తంటికొండ, ఇటికాయలపల్లి గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, రౌతు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణునిపాలెంలో మాట్లాడుతున్న సచివాలయ మండల కన్వీనర్ రమేష్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దోసకాయలపల్లిలో గడపగడపకూ..

మధురపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకూ గ్రామంలో పర్యటించారు. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక బీసీపేట నుంచి ఎస్సీపేట వరకూ 622 గడపలు తిరిగారు. ఆయనకు అక్కచెల్లెమ్మలు హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజా ప్రతి గడపకూ వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. స్థానికులు తెలిపిన మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధిలైట్లు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీపేటలో సామాజిక భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్న, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బేదంపూడి పాప, పార్టీ నాయకులు కంటే వినయ్ తేజ, కడవల శివ, గొల్లవిల్లి మురళీ, గండిబోయిన రాజు, గడిమాల కొండ పాల్గొన్నారు.



దోసకాయలపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

నేడు పశ్చిమగానుగూడెంలో..

మండలంలోని పశ్చిమగానుగూడెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

రంగంపేట: విధుల్లో అలసత్వం వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పెదరాయవరం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. జగనన్న సురక్షలో అందించే టోకెన్లు, సర్వీసు రిక్వెస్టులు తక్కువగా ఉన్నాయని, ఇప్పటికైనా ఎక్కువగా చేయించాలని హెచ్చరించారు. అనంతరం పెదరాయవరంలో ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్షపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వివరాలు సేకరించి తానే స్వయంగా సేవా పోర్టల్‌లో నమోదు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష టీమ్–1, టీమ్–2 సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో రంగంపేట మండలం జగనన్న సురక్ష కార్యక్రమంలో టోకెన్లు, సర్వీసు రిక్వెస్టుల్లో చివరి స్థానంలో ఉందని, ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.బాలశంకరరావు, ఎంపీడీఓ బి. శ్రీరామరాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు పాల్గొన్నారు.



పెదరాయవరంలో లబ్ధిదారుల వివరాలు సేకరించి సేవ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్న జేసీ తేజ్ భరత్

డేటా ఎనలిటిక్స్‌పై అవగాహన అవసరం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఇంజినీరింగ్ విద్యార్థులు డేటా ఎనలిటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు సూచించారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ వర్క్ షాప్ జరిగింది. ఏపీ ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు, ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్ట్స్ సహకారంతో దీన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సమాచార విశ్లేషణకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. సమర్థవంతమైన డేటా సహాయంతో పారదర్శక పరిపాలన అందించవచ్చన్నారు. కార్యక్రమానికి రిసోర్సుపర్సన్‌గా ఎన్ఐటీ (ఏపీ) సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ కె.హిమబిందు, జేఎన్‌టీయూకే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ ఆచార్య ఎం.కృష్ణ ప్రసాద్, నన్నయ వర్సిటీ కాకినాడ క్యాంపస్ డాక్టర్ ఎం.కమలాకుమారి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్ వ్యవహరించారు.

దిశ సభ్యుడిగా వాసంశెట్టి రవికుమార్



రవికుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ(దిశ) సభ్యుడిగా బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిధిలో ముగ్గురు సర్పంచ్‌లు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వాసంశెట్టి రవికుమార్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

అనపర్తి: గ్రామ పంచాయతీల అభివృద్ధి, గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడంపై సర్పంచ్‌లు, పంచాయతీ పాలక మండలి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పవరంలో పంచాయతీ ఆధ్వర్యంలో సంరక్షిస్తున్న కొబ్బరి, మామిడి మొక్కలకు ఎరువులు వేసే కార్యక్రమంలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి సారించిన కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి కొప్పవరం –లక్ష్మీనరసాపురం రహదారికి ఇరువైపులా 416 కొబ్బరి, 169 మామిడి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను బాధ్యతగా నిర్వర్తిస్తున్నారంటూ అభినందించారు. మాజీ సర్పంచ్ తాడి వెంకటరామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సత్తిరెడ్డి, వార్డు సభ్యులు పొన్నాడ నాగేశ్వరరావు, మేడిశెట్టి సన్యాసిరావు, బండారు సూర్యప్రకాశరావు, దాసరి సత్యనారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కొబ్బరి మొక్కకు ఎరువులు వేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

గర్భిణులకు పండ్లు, పాలు పంపిణీ

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణులు, ఇతర రోగులకు ఎన్ఆర్ఐ కంబాల శ్రీనివాస్ సహకారంతో పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కర్రి సూరారెడ్డి మాట్లాడుతూ గోకవరం ప్రభుత్వాస్పత్రికి ఎన్ఆర్ఐ శ్రీనివాస్ సహకారంతో త్వరలో అంబులెన్స్ సదుపాయం సమకూర్చనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పెనుగొండ సత్యానందం, సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి, స్థానిక నాయకులు తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, బండి మణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం రేషన్ సరకులు పంపిణీ చేయాలి

పెదపూడి: ప్రజలకు నిబంధనల ప్రకారం రేషన్ సరకులు పంపిణీ చేయాలని, నిబంధనల ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎంవీ ప్రసాద్ హెచ్చరించారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ టి.సుభాష్ ఆధ్వర్యంలో మంగళవారం రేషన్ షాపు డీలర్లు, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ ప్రసాద్ మాట్లాడుతూ రేషన్ షాపుల్లో, ఎండీయు వాహనాల్లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. రేషన్ కార్డుల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకులు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా రేషన్‌షాపు డీలర్లు తమ సమస్యలను ఆయనకు విన్నవించగా పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఓ ప్రసాద్

డీ వార్మింగ్ మందుల పంపిణీ

బిక్కవోలు: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పశు రైతులకు డీవార్మింగ్ మందులను సర్పంచ్ గండికోట వీరభద్రరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ డి.ప్రణీత్ మాట్లాడుతూ డీవార్మింగ్ మందు వాడడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఎదుగుదల బాగుంటుందన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

గోకవరం: రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన దిశ సమావేశంలో గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పలు సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో ఎంపీపీ గోకవరంలో అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఎనిమిది మంది రైతులకు ఇంకా నగదు ఇవ్వలేదన్నారు. అలాగే పలు సమస్యలను వివరించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ మాధవీలత హామీ ఇచ్చారన్నారు. గోకవరం మండలం త్వరలో రుడాలో కలుస్తుందని సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రుణం మంజూరవుతుందన్నారు. ఇండస్ట్రియల్ డెవలెప్మెంట్‌లో పీఎంజీసీవైలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు వస్తాయని ఆసక్తి గలవారు దరఖాస్తులు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారన్నారు.